గవర్నర్ ప్రసంగంలో పసలేదు

- ఏఐ, చాట్ జీపీటీలతో తయారుచేసినట్టుంది
- గవర్నర్ కూడా మనసుపెట్టి చదివినట్టు లేదు
- 36 నిమిషాల్లో 360 అబద్ధాలాడించారు
- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ) గవర్నర్ ప్రసంగంలో పసలేదని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, చాట్ జీపీటీలను వాడి ప్రసంగ పాఠం తయారుచేసినట్టుగా ఉన్నదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే జీ జగదీశ్‌రెడ్డి ఎద్దేవాచేశారు. గవర్నర్ ప్రసంగం గొప్పగా, అర్థవంతంగా, మనసుపెట్టి, వాస్తవాలతో, బడ్జెట్ ప్రతిబింబించేలా ఉండాలిగాని, ఈ ప్రసంగాన్ని చూస్తే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, చాట్ జీపీటీలను ఉపయోగించి తయారుచేసినట్టు ఉన్నదని చెప్పారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై గురువారం జరిగిన చర్చలో బీఆర్ఎస్ తరఫున జగదీశ్‌రెడ్డి మాట్లాడారు. గవర్నర్ చేత 36 నిమిషాల్లోనే 360 అబద్ధాలు మాట్లాడించారని విమర్శించారు. కవి ఆత్రేయ ఉండి ఈ ప్రసంగాన్ని చూసి ఇంత దరిద్రంగా ఉంటదా? అని ఆత్మహత్య చేసుకునేవాడని, గవర్నర్ కూ డా మనస్ఫూర్తిగా చదివి ఉండరని, మెకానికల్‌గా చదివి వెళ్లిపోయారని వ్యాఖ్యానించారు.

మూసుకొని కూర్చోండి..

ఫామ్ హౌస్ అంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రన్నింగ్ కామెంటరీ చేస్తుండగా జగదీశ్‌రెడ్డి సమర్థంగా తిప్పికొట్టారు. 'మా నేత కేసీఆర్ మీ సీఎంకు దగ్గరగానే ఉన్నారు. ఎక్కువ మాట్లాడకుండా మూసుకొని కూర్చోండి' అంటూ చురకలంటించారు. తాను రైతుల గురించి మట్లాడుతున్నానని, మీలాగా కమీషన్ల గురించి మా ట్లాడటం లేదని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

ఏమిచ్చారు.. ఎక్కడిచ్చారు..?

'మ్యానిఫెస్టోలో పెట్టిన ఒక్క హామీనైనా నెరవేర్చారా? ఏమిచ్చారు, ఎక్కడిచ్చారంటూ జగదీశ్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'రైతులకు రుణమాఫీ చేశారా? రైతు భరోసా ఇచ్చారా? ఆటో కార్మికులు, ఈజీఎస్ కూలీలు, రైతు కూలీలకు 12వేలు ఇచ్చారా? రైతులకు బోనస్ ఇచ్చారా? విద్యార్థినులకు స్కూటీలు ఇచ్చారా? 2 లక్షల ఉద్యోగాలిచ్చారా? ఎక్కడిచ్చారు? అంటూ నిలదీశారు. జగదీశ్‌రెడ్డి మాట్లాడుతుండగా విప్ ఆది శ్రీనివాస్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అడ్డుతగిలారు. ఈ క్రమంలో తలసాని శ్రీనివాస్ యాదవ్ కల్పించుకుని తమ సభ్యుడు మాట్లాడుతుండగా, మం త్రులు అడ్డుతగులుతున్నారని. నువ్వెంత అంటే నేనెంత అన్నట్టు నడుచుకుంటే సభ నడుస్తుందా? అంటూ ప్రశ్నించారు. ఈ తరుణంలో స్పీకర్‌ప్రసాద్‌కుమార్ కల్పించుకుని గవర్నర్ ప్రసంగంపైనే మాట్లాడాలని జగదీశ్‌రెడ్డికి సూచించారు. అధికార పక్షం డీవియేషన్ కాకుండా ఉండేందుకు గవర్నర్ ప్రసంగంపైనే మాట్లాడాలన్నారు. మళ్లీ కల్పించుకున్న తలసాని మంత్రి కోమటిరెడ్డి గవర్నర్ ప్రసంగం మీదనే మాట్లాడారా? వారు డివియేట్ కాలేదా? అంటూ ప్రశ్నించారు.

హక్కులు కోరితే బహిష్కరణా?

ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపితే వేటేస్తారా?

ఒక్క గొంతు నొక్కినంత మాత్రాన పోరాటం ఆగదు

- అసత్యాల ఆధారంగా, ఏకపక్షంగా జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్
- గవర్నర్ ప్రసంగంలో అబద్ధాలపైనే జగదీశ్ ప్రశ్నించారు
- ముఖ్యమంత్రి ఆదేశాలతోనే అనని మాట అన్నట్టు కుట్ర
- రికార్డులను పరిశీలిద్దామని కోరినా వినిపించుకోలేదు
- బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ సర్కార్ కావాలనే కుట్ర చేసింది
- నిప్పులు చెరిగిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ప్రజాకోర్టులో కాంగ్రెస్ పార్టీకి శిక్ష తప్పదని హెచ్చరిక
- రాష్ట్రమంతా ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనానికి పిలుపు
- ఇది ప్రజాస్వామ్యంలో చీకటి రోజు : హరీశ్ ఆగ్రహం

జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌ను నిరసిస్తూ ఎన్టీఆర్ మార్గ్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న హరీశ్‌రావు. చిత్రంలో సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మి.

హైదరాబాద్/ హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 13 (నమస్తే తెలంగాణ) : మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని స్పీకర్ సస్పెండ్ చేయడంపై బీఆర్ఎస్ భగ్గుమన్నది. 'ప్రజా సమస్యలు లేవనెత్తితే సస్పెండ్ చేస్తారా?' అంటూ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నెక్లెస్ రోడ్డులోని అతిపెద్ద బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం నిరసన చేపట్టారు. 'ప్రభుత్వ నియంతృత్వ వైఖరి నశించాలి.. వియ్ వాంట్ జస్టిస్.. జై తెలంగాణ.. ప్రజాస్వామ్యం ఖూనీ.. హక్కులు కాపాడాలని కోరితే బహిష్కరణ వేటా? ప్రభుత్వ దమనకాండ నశించాలి.. ఇదేమి రాజ్యం? ఇదేమీ రాజ్యం? దొంగల రాజ్యం దోపిడి రాజ్యం.. ప్రభుత్వ వైఫల్యాలు ఎత్తి చూపితే బహిష్కరిస్తరా?' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేయడంతో అంబేద్కర్ ప్రాంగణం, నెక్లెస్ రోడ్డు ప్రాంతమంతా హోరెత్తింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ 'పేరుకేమో ప్రజాపాలన అని గొప్పలు చెప్పుకొంటూ.. ప్రజల తరఫున మాట్లాడే సభ్యుల గొంతు నొక్కడం ఏమిటి' అని ప్రశ్నించారు. తెలంగాణ శాసనసభలో ప్రజాస్వామ విలువలకు పాతరేస్తూ నిరాధార ఆరోపణలతో బీఆర్ఎస్ శాసన సభ్యుడు జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయటం దారుణమని ఆగ్రహం వ్యక్తంచేశారు. అనని మాటలు అన్నట్టు ఆరోపించి అబద్ధాల ఆధారంగానే జగదీశ్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం సస్పెండ్ చేసిందని మండిపడ్డారు. బడ్జెట్ సమావేశాల్లో బీఆర్ఎస్ ఉంటే కాంట్రాక్టులు, కమీషన్లు, ఢిల్లీకి పంపుతున్న మూటల విషయాలు ప్రజలకు తెలుస్తాయనే భయంతోనే తమ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని దెప్పిపొడిచారు. గవర్నర్ ప్రసంగంలో చెప్పిన పచ్చి అబద్ధాల మీద తమ ఎమ్మెల్యే మాట్లాడితే 6 నిమిషాల్లోనే ఉద్దేశపూర్వకంగా అటు మంత్రులు, ఎమ్మెల్యేలు రన్నింగ్ కామెంట్రీ చేస్తూ అవమానించారని, అయినా ఏమాత్రం సంయమనం కోల్పోకుండా రాష్ట్రంలో జరగని రుణమాఫీ, ఇంకా పడని రైతు బంధు, ఎండిపోతున్న పంటలపై మాట్లాడుతుంటే తట్టుకోలేక ప్రభుత్వం నిసిగ్గుగా జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేసిందని ఫైర్ అయ్యారు. ఏకపక్షంగా నియంతృత్వ పోకడతో రాష్ట్ర ప్రభుత్వం 5 గంటలు సభను వాయిదా వేసిందని చెప్పారు. ఢిల్లీలో ఉన్న సీఎం ఆదేశాలతోనే ఇదంతా జరిగిందని విమర్శించారు. 'ఉరిశిక్ష పడిన వ్యక్తిని కూడా ఆఖరి కోరిక ఏమిటో అడుగుతారు.. కానీ మా నుంచి ఎలాంటి వివరణా అడగకుండా సస్పెండ్ చేయటం దారుణం' అని ఆగ్రహం వ్యక్తంచేశారు. తామేమైనా పొరపాటుగా మాట్లాడితే టీవీ పెట్టి అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకోవాలని స్పీకర్‌కు, మంత్రి శ్రీధర్ బాబుకు సూచించినట్టు తెలిపారు.అదేం పాటించకుండా ఏకపక్షంగా కాంగ్రెస్ సభ్యులు చెప్పిందే మూడ్ ఆఫ్ హౌస్ అన్నట్టు తమ గొంతునొక్కారని ఫైర్ అయ్యారు. ప్రపంచంలో అతిపెద్దదైన 125 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని కేసీఆర్ ప్రభుత్వంలో సగర్వంగా ఏర్పాటు చేసుకుంటే ఆ అంబేద్కర్ ప్రాంగణం గేట్లు మూసేసి ఆ మహానుభావుడుని కూడా సంకెళ్లతో ఈ ప్రభుత్వం బంధించిందని నిప్పులు చెరిగారు. భవిష్యత్తులో కాంగ్రెస్ మూల్యం చెల్లించుకోకతప్పదని, ప్రజాకోర్టులో శిక్ష తప్పదని హెచ్చరించారు. సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనానికి పిలుపునిచ్చారు.

రేవంత్ డైరెక్షన్.. మంత్రి యాక్షన్: హరీశ్

కాంగ్రెస్ పార్టీ పట్టపగలే ప్రజాస్వామ్యం గొంతుకోసిందని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. పథకం ప్రకారమే జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ అని విమర్శించారు. 'ప్రశ్నిస్తే కేసు లు, అక్రమ అరెస్టులు, సభలో ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే గొంతు నొక్కటం, సస్పెండ్ చేయటం ఇదేనా ప్రజా పాలన?' అని నిలదీశారు. ముందు అసెంబ్లీ లాబీలో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడిన హరీశ్, అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టిన నిరసనలోనూ మాట్లాడారు. దళిత స్పీకర్ అంటూ ఆయన స్థాయి, గౌరవాన్ని తగ్గించేలా కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నదని ఆక్షేపించారు. స్పీకర్‌గా ప్రసాద్ పేరును ప్రభుత్వం ప్రకటించగానే కేసీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలమంతా ఏకగ్రీవం గా ఎన్నికకు సహకరించామని గుర్తుచేశారు. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని పెట్టి, సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టి దళితజాతి గౌరవాన్ని పెంచింది కేసీఆరేనని వివరించారు. రేవంత్‌రెడ్డి డైరెక్షన్‌లో శ్రీధర్‌బాబు యాక్షన్ చేస్తున్నారని ఎద్దేవాచేశారు. పావుగంటకోసం సభను వాయిదా వేసి ఢిల్లీలోని రేవంత్‌రెడ్డితో మాట్లాడారని, తాము నిరసన కోసం అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్తే తాళం వేశారని ఫైర్ అయ్యారు. స్పీకర్‌ను జగదీశ్ అవమానించలేదని స్పష్టంచేశారు. 'సభలో మీ అనే పదం వా డితే ఏకవాక్య సంబోధం ఎలా అవుతుంది?' అని ప్రశ్నించారు. జగదీశ్‌రెడ్డి సభలో మాట్లాడుతూ సభ మీ ఒక్కరిది కాదని మాత్రమే అన్నారని, సభ కేవలం ప్రభుత్వపక్షమో, ప్రతిపక్షమో కాదని, సభ సభ్యుల అందరిదనే విశాలార్థంలో మా ట్లాడిన మాటను కూడా అన్‌పార్లమెంట్ పదమంటే ఎట్లా అని నిలదీశారు.

కించపరిచే వ్యాఖ్యలు చేయలేదు: జగదీశ్

తన రాజకీయ జీవితంలో ఏనాడూ శాసనసభలో కించపరిచే వ్యాఖ్యలు చేయలేదని జగదీశ్‌రెడ్డి తెలిపారు. స్పీకర్ అధికారాలు, విధులు తనకు తెలుసునని చెప్పారు. ఎక్కడా స్పీకర్ గౌరవానికి భంగం కలిగించలేదని, ఇది కేవలం ప్రభుత్వ కుట్ర అని, తన సస్పెన్షన్‌కు స్పీకర్ సమ్మతిస్తారనుకోలేదని వాపోయారు. ఎండుతున్న పంటలు, ప్రజల సమస్యలు, రైతుల బాధలు, వివిధ వర్గాల ప్రజలు ఎలా మోసపోయామని బాధపడుతున్నారో వివరాలను స్పీకర్ దృష్టికి తెచ్చే ప్రయత్నం చేశానన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు తమకు ఉన్నదని చెప్పారు. తనకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని స్పీకర్‌ను ప్రాధేయపడ్డానని, ఈ సభ అందరిదని.. కాంగ్రెస్ వాళ్లదే కాదని, అందరినీ నియంత్రించాలని మాత్రమే స్పీకర్‌కు గుర్తుచేశానని తెలిపారు. స్పీకర్ స్థానానికి కులం, మతం ఉంటుందా? అని ప్రశ్నించారు. నిరసన కార్యక్రమంలో శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, ఎమ్మెల్సీ వాణీ దేవి, బీఆర్ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, గంగుల కమలాకర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, ముఠా గోపాల్, కేపీ వివేకానంద పాల్గొన్నారు.

జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్

మొదటిపేజీ తరువాయి...

సభ నుంచి వెంటనే వెళ్లాలని జగదీశ్‌రెడ్డిని ఆదేశించారు. జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌పై బీఆర్ఎస్ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. హరీశ్‌రావు మాట్లాడుతూ ఉరిశిక్ష విధించినవారికి చివరి మాటలు చెప్పుకునే అవకాశమిస్తారు. కానీ తమకు అవకాశమివ్వకపోవడమేమిటని ప్రశ్నించారు. అసెంబ్లీలోని ప్రధాన ప్రతిపక్షనేత కార్యాలయంలో జగదీశ్‌రెడ్డి కూర్చోగా చీఫ్ మార్షల్ వచ్చి అసెంబ్లీ నుంచి బయటికెళ్లాలని సూచించారు. సభ నుంచి మాత్రమే బయటికెళ్లాలని స్పీకర్ రూలింగ్ ఇచ్చారని, ప్రతిపక్ష నేత చాంబర్‌లో కూర్చుంటే అభ్యంతరమేమిటని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రశ్నించారు. తాను ఎమ్మెల్యేనని, బయటికెళ్లాలని చెప్పడానికి మీరెవరని చీఫ్ మార్షల్‌ను జగదీశ్ ప్రశ్నించారు. దీనిపై స్పీకర్ నుంచి స్పష్టత తీసుకోవాలని సూచించారు.

ఇదీ జరిగింది!

అధికారపక్షం నుంచి మంత్రి ఏం మాట్లాడారో రాష్ట్రమంతా చూస్తున్నదని, మంత్రి మాట్లాడిన మాటలకు గవర్నర్ ప్రసంగానికి ఏమైనా సంబంధం ఉన్నదా? అంటూ సభలో జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. దీనిపై సభలో తేల్చాలని సభలో ఉండుమంటే ఉంటా.. పోమ్మంటే పోతా అంటూ వ్యాఖ్యానించారు. మంత్రి శ్రీధర్‌బాబు కల్పించుకొని సభా సంప్రదాయాలను గౌరవించాలని, స్పీకర్‌ను బెదిరించడం సబబుకాదని, సూచనలు చేస్తే స్వీకరిస్తామన్నారు. ఈ క్రమంలో స్పీకర్ కల్పించుకొని జగదీశ్‌రెడ్డిని ఉద్దేశించి సహనంతో ఉండాలని, సభను తప్పుదోవ పట్టించడం సరికాదని సూచించారు. దీనిపై జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ తాను విరుద్ధంగా ఏం మాట్లాడానో చెప్పాలని డిమాండ్ చేశారు. స్పీకర్‌ను ప్రశ్నించడం సభా సంప్రదాయాలకు విరుద్ధమని బదులిచ్చారు. 'జగదీశ్‌రెడ్డి స్పందిస్తూ అసలే విరుద్ధం కాదు. ఈ సభ మనందరిది. ఈ సభలో అందరికీ సమానమైన హక్కులున్నాయి. మా అందరి తరఫున పెద్ద మనిషిగా స్పీకర్‌గా మీరు కూర్చున్నారు. ఈ సభ మీ సొంతం కాదు' అంటూ వ్యాఖ్యానించారు. జగదీశ్‌రెడ్డి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలని మంత్రి శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. హరీశ్‌రావు మాట్లాడుతూ మంత్రి వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తంచేశారు. జగదీశ్‌రెడ్డి ఏం తప్పు మాట్లాడారని ప్రశ్నించారు. 'సభలో సభ్యులకు సమాన అవకాశాలుంటాయి. శాసనసభ అంటే కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వానికి సంబంధించినది కాదు. ప్రతిపక్ష సభ్యులకు సమాన హక్కు ఉంటుందని జగదీశ్‌రెడ్డి అన్నారు' అని హరీశ్ స్పష్టంచేశారు. దీంతో అధికారపక్ష సభ్యులు నినాదాలు చేశా రు. జగదీశ్‌రెడ్డికి అవకాశం ఇచ్చినా అధికార పక్షం సభ్యులు అడ్డుతగిలారు. అయినా వెనక్కి తగ్గని జగదీశ్‌రెడ్డి 'సభా సంప్రదాయాలు తేలాలె. స్పీకర్ అధికారాలు తేలాలో. సభ్యుల హక్కులు తేలాలె' అంటూ మాట్లాడారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కలుగజేసుకొని జగదీశ్‌రెడ్డి క్షమాణలు చెప్పాలని, ఆయనను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సభ్యుల నినాదాలతో సభలో గందరగోళం నెలకొన్నది. దీంతో స్పీకర్ సభను 15 నిమిషాల పాటు వాయిదా వేశారు. అనంతరం ప్రారంభమైన సభలో కాంగ్రెస్ సభ్యుల డిమాండ్లతో జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ స్పీకర్ ప్రకటించారు.

జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయాలంటూ సభలో ప్రతిపాదిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

భయంతోనే బీఆర్ఎస్ గొంతు నొక్కే ప్రయత్నం

- కమీషన్లు, ఢిల్లీకి పంపేమూటలపై చర్చకు రావద్దనే దుశ్చర్య
- సీఎం ఆదేశాలతో జగదీశ్ సస్పెండ్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- సస్పెన్షన్‌పై నేడు నిరసనలు
- సర్కార్ దిష్టిబొమ్మల దహనం
- పార్టీ నేతలు, శ్రేణులకు పిలుపు

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): శాసనసభలో ప్రజాస్వామ్య విలువలకు పాతరేస్తూ, నిరాధార ఆరోపణలతో ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడం దారుణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. జగదీశ్‌రెడ్డి చెప్పని మాటలను చెప్పినట్టు ఆరోపిస్తూ ఆయనను కాంగ్రెస్ ప్రభుత్వం సస్పెండ్ చేసిందని మండిపడ్డారు. బడ్జెట్ సమావేశాల్లో బీఆర్ఎస్ ఉంటే కాంట్రాక్టులు, కమీషన్లు, ఢిల్లీకి పంపుతున్న మూటల విషయాలు చర్చకి వస్తాయనే భయంతోనే తమ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా అంబేద్కర్ విగ్రహం ఎదుట బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో నిరసన తెలిపిన కేటీఆర్.. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించారు. గవర్నర్ ప్రసంగంలోని అసత్యాలు, అర్ధసత్యాలను ఎత్తిచూపుతున్న జగదీశ్‌రెడ్డిని ప్రభు త్వం కుట్రపూరితంగానే సస్పెండ్ చేసిందని ఆరోపించారు. మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రన్నింగ్ కామెంట్రీ చేస్తూ ప్రసంగానికి అంతరాయం కలిగించినా జగదీశ్‌రెడ్డి ఏమాత్రం సంయమనం కోల్పోలేదని స్పష్టం చేశారు. ఎండిపోతున్న పంటలు, అధోగతి పాలైన వ్యవసాయం, రైతుల కష్టాలు, జరగని రుణమాఫీ, పడని రైతుబంధు, అమలుకాని ఆరు గ్యారెంటీలు, 420 హామీల వాగ్దాన భంగం తదితర అంశాలపై ప్రభుత్వాన్ని విమర్శిస్తుంటే తట్టుకోలేని ప్రభుత్వం నీతి బాహ్యంగా జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేసిందని పేర్కొన్నారు. జగదీశ్‌రెడ్డి అన్‌పార్లమెంటరీ పదాలు వాడలేదని స్పష్టంచేశారు. సభలో తండ్రిగా ప్రతిపక్షం హక్కులు కాపాడాలని కోరారే తప్ప, అగౌరవపరచలేదని తెలిపారు. 5 గంటలు సభను వాయిదా వేసి ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్ ఆదేశాల మేరకు జగదీశ్‌ను సస్పెండ్ చేసిందని మండిపడ్డారు. వివరణ అడగకుండా, ఏం తప్పు చేశారో చెప్పకుండానే సస్పెండ్ చేయడం కాంగ్రెస్ సర్కారు దురహంకారానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తంచేశారు.

అంబేద్కర్ విగ్రహం సంకెళ్ల తో బంధి

కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రపంచంలోనే అతిపెద్దదైన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని సంకెళ్లతో బంధించిన నీచమైన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదని కేటీఆర్ విమర్శించారు. ఒక గొంతు నొక్కినంత మా త్రాన ఏదో సాధించామని భ్రమపడతున్న కాంగ్రెస్ అప్రజాస్వామిక వైఖరిని నిరసిస్తూ.. సీఎం రేవంత్ అహంకార, నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనానికి పిలుపునిచ్చినట్టు తెలిపారు.

జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ ఏకపక్షం

మమ్మల్ని సంప్రదించలేదు

సభలో గందరగోళం ఏర్పడితే చర్చ, క్షమాపణలు ఉంటాయి

అలాంటివి ఏమీ ఈసారి జరగలేదు

ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్టీ సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌పై ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని, అధికార పక్షం తమను కనీసం సంప్రదించలేదని ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ ఆక్షేపించారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఉదయం 10 గంటలకు అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైతే అప్పటి నుంచి సాయంత్రం 5.30 గంటలవరకు సభలోనే తాము కూర్చొని ఉన్నామని తెలిపారు. సభలో ఏదైనా గందరగోళం జరిగితే స్పీకర్ సమక్షంలో వివిధ పార్టీలతో చర్చించడం, ఒకవేళ పరుష పదజాలం వాడితే ఆసభ్యుడితో అవసరమైతే క్షమాపణలు చెప్పించడం వంటి చర్యలు ఉంటాయని చెప్పారు. కానీ జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ విషయంలో అలాంటివేమీ జరగలేదని తెలిపారు. ఎన్నికల ముందు కండీషన్లు లేకుండా హామీలు గుప్పించి, ఇప్పుడు మాత్రం అనేక ఆంక్షలు పెడుతున్నారని విమర్శించారు. కొత్త రేషన్ కార్డుల కోసం 3 సార్లు ప్రజలు దరఖాస్తు చేసుకున్నారని, ఇంకా ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలని ప్రశ్నించారు. కొత్త రేషన్‌కార్డులు ఎప్పటి నుంచి ఇస్తారో స్పష్టమైన తేదీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. గత సంక్రాంతి నుంచే ఇస్తామని చెప్పిన సన్నబియ్యం ఇంకెప్పటి నుంచి ఇస్తారని నిలదీశారు.

సూర్యాపేట జిల్లా కేంద్రంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌పై నిరసనల వెల్లువ

- ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా భగ్గుమన్న బీఆర్ఎస్ శ్రేణులు
- రాస్తారోకోలు, దిష్టిబొమ్మల దహనం

నల్లగొండ ప్రతినిధి, మార్చి13(నమస్తే తెలంగాణ) : మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై బడ్జెట్ సమావేశాల సెషన్ నుంచి సస్పెన్షన్ వేటు వేయడంపై ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు, ఉద్యమకారులు గురువారం ఎక్కడికక్కడ రోడ్లపైకి వచ్చి ఆందోళనలకు దిగారు. నల్లగొండలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో క్లాక్‌టవర్ సెంటర్‌లో నల్లజెండాలు, బ్యాడ్జీలతో ర్యాలీ తీసి రోడ్డుపై బైఠాయించారు. ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. హాలియాలో ర్యాలీ తీశారు. సాగర్ క్రాస్ రోడ్స్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనంచేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో పార్టీ నేతలు, కార్యకర్తలు తెలంగాణ తల్లి విగ్రహం వరకు నిరసన ర్యాలీ తీశారు. సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. జగదీశ్‌రెడ్డి స్వగ్రామం నాగారం మండలం కేంద్రంలోనూ బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అర్వపల్లి, తుంగతుర్తి, మోత్కూరులోనూ ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు.

సభ నుంచి సస్పెన్షన్ ఏకపక్షం!

- బీఆర్ఎస్‌కు దక్కని మాట్లాడే చాన్స్
- వివరణకు సమయమివ్వకుండా ఎలా నిర్ణయం తీసుకుంటారని రాజకీయవర్గాల్లో విస్మయం

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ) : సభ నుంచి జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ ఏకపక్షమని, ప్రతిపక్ష సభ్యులకు కనీసం మాట్లాడే అవకాశం గాని, వివరణ ఇచ్చే సమయం గాని దక్కకపోవటం ఏమిటని, ఏకపక్షంగా నిర్ణయాలు ఎలా తీసుకుంటారని రాజకీయవర్గాలు విస్మయం వ్యక్తంచేస్తున్నాయి. సభా సంప్రదాయాల ప్రకారం ఎవరైనా సభ్యుడిపై చర్యలు తీసుకునే ముందు సభ్యుడికి గాని, లేదా సదరు పార్టీ పక్ష నాయకుడికి గాని మాట్లాడే అవకాశం, వివరణ ఇచ్చే సమయం కల్పించాలని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఎథిక్స్ కమిటీ ఆధారంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని చెప్తున్నారు.

ప్రతిపక్షాల గొంతు నొక్కొద్దు

కాంగ్రెస్ ఇచ్చిన హామీలపైనే జగదీశ్‌రెడ్డి మాట్లాడారు..

సభ అందరిది.. కాంగ్రెస్‌ది కాదని ప్రస్తావించారు..: మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్షాల గొంతు నొక్కవద్దని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలపై మాత్రమే మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రస్తావించారని పేర్కొన్నారు. ఈ సభ కాంగ్రెస్ సభ కాదని తమ సభ్యుడు మాట్లాడరని స్పష్టం చేశారు. అయితే కాంగ్రెస్ నేతలు మాత్రం స్పీకర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేశారంటూ నిందలు వేసి, దాదాపు నాలుగు గంటల పాటు సభను నిలిపివేశారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇదే అంశాన్ని అధినేత కేసీఆర్‌కు వివరించామని, తాము తప్పు చేయకున్నా స్పీకర్‌కు క్షమాపణలు చెప్పి సభ నడిచేలా చూడాలని ఆయన ఆదేశించినట్టు తెలిపారు. రికార్డులు పరిశీలించాలని, తప్పుంటే జగదీశ్వర్‌రెడ్డి విచారం వ్యక్తం చేస్తారని చెప్పినట్టు స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై ప్రజల పక్షాన పోరాడేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సభ నిర్వహించాలని స్పీకర్‌ను కోరినట్టు వెల్లడించారు. జగద